నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18 వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం,12 జనవరి 2025

నోరు అదుపులో పెట్టుకో రోజా.. చెప్పు దెబ్బలు తప్పవు

– సుంకర పావని తిరుమల కుమార్

కాకినాడ,మేజర్‌న్యూస్ : రోజా తన నోరును అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే చెప్పుదెబ్బలు తప్పవని కాకినాడ మాజీ మేయర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుంకర పావని తిరుమల కుమార్ హెచ్చరించారు. చంద్రబాబు నాయుడుని, పవన్ కళ్యాణ్‌ని విమర్శించే స్థాయి నీకు లేదు, తిరుపతి రుయా దుర్ఘటనలో 11మంది ఆక్సిజన్ లేక చనిపోతే ప్రశ్నించినవారిని అరెస్టు చేసిన నువ్వా మాట్లాడేది అంటూ తీవ్రంగా దుయ్యబట్టారు. ఎల్‌జి పాలిమర్స్ విషవాయువు పీల్చి 13 మంది చనిపోతే వారి సంగతి ఏమిటి? మీ ప్రభుత్వ నిర్లక్ష్యం వలన అన్నమయ్య ప్రాజెక్టు దుర్ఘటనలో రమారమి 33మంది చనిపోతే, కచ్చులూరు బోటు ప్రమాదంలో 46 మంది జలసమాధి మీద సమాధానం ఏంటి? అంటూ నిలదీశారు. చేతకాని మీ గత ప్రభుత్వం వల్ల జంగారెడ్డిగూడెంలో కల్తీ సారా తాగి 27 మంది చనిపోయిన దానికి ఏమి సమాధానం చెబుతావ్ రోజా? అంటూ ప్రశ్నించారు. మీప్రభుత్వం అవినీతి వలన ఏలూరులో త్రాగునీరు కలుషితమై 600 మందికి అస్వస్థతకు గురవలేదా? బాబాయ్ గొడ్డలిపోటుని గుండెపోటుగా చెప్పిన మీ జగన్ రెడ్డి హంతకుడు కాదా? అంటూ నిలదీశారు. ఒక ప్రమాదాన్ని కూడా రాజకీయంగా వాడుకునే నీచులు నువ్వు మీ జగన్ రెడ్డి అంటూ ఘాటుగా స్పందించారు. నోరు అదుపులో ఉంచుకో రోజా..లేకపోతే నీకు చెప్పు దెబ్బలు తప్పవు అని హెచ్చరించారు.

జిల్లాలో 680 మినీ గోకులం నిర్మాణానికి

ఇప్పటి వరకు 304 షేడ్స్ నిర్మాణం పూర్తి చేశాం

- రైతు పక్షపాతిగా రైతులకు మంచి చేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుంది
- గ్రామంలో 1.85 లక్షలతో నిర్మించిన గోకులాన్ని ప్రారంభించి, అనంతరం సంక్రాంతి సంబరాల వేడుకల్లో....
- మంత్రి కందుల దుర్గేష్ – కలెక్టర్ ప్రశాంతి

నిడదవోలు(విజ్జేశ్వరం),మేజర్‌న్యూస్ : రైతు పక్షపాతిగా రైతులకు మంచి చేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వంనిబద్ధతతోవారి మేలు కోరి పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో రు.1.85 లక్షలతో నిర్మించిన మినీ గోకులాన్ని మంత్రికందులదుర్గేష్,జిల్లాకలెక్టర్ పి.ప్రశాంతితోకలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సాంప్రదాయ పద్ధతిలో గోమాతకు పూజలు నిర్వహించి, పొలంలో వరి నాట్లను స్వయంగా నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. అనంతరం ఎడ్ల బండి పై గ్రామంలోకి విచ్చేసి సంక్రాంతి వేడుకల్లో భాగస్వామ్యం అయ్యారు. మహిళలు చిన్నారులు వేసిన ముగ్గులను, సాంప్రదాయ పద్ధతిలో హరినామం చేస్తున్న హరిదాసు సంకీర్తన ను ఆసక్తిగా తిలకించి, భోగి మంటలను వెలిగించి ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 12500 మినీ గోకులాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం ద్వారా రాష్ట్రంలో పశు సంపద అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. అదే క్రమంలో తూర్పు గోదావరి జిల్లాలో 680 మినీ గోకులం నిర్మాణం కోసం రూ.15కోట్ల 59 లక్షలతో చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు రూ.6 కోట్ల 18లక్షల వ్యయంతో 304 షేడ్స్ నిర్మాణం పూర్తి చేసామన్నారు. రైతు పక్షపాతిగా రైతులకు మంచి చేయాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రైతులకుఅండగా నిలుస్తుందన్నారు.పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 12,500 గోకులాలను ఒకే రోజు ప్రారంభించే కార్యక్రమాన్ని నిన్నటి రోజున డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం వేదికగా ప్రారంభించారని పేర్కొన్నారు.. పాడి రైతులకు ఎంతో అవసరం అయ్యే గోకులాలను గత అయిదేళ్ల పాలనలో కేవలం 268 నిర్మిస్తే, ఎన్డీయే కూటమి ప్రభుత్వం కేవలం ఆరు నెలల్లోనే 12,500 నిర్మించి పాడి రైతులకు అండగా నిలిచిందని, ఇది కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.నిడదవోలు నియోజక వర్గంలో 128 గోకులాలు మంజూరు కాగా ఇప్పటివరకు రు. 1కోటి 13 లక్షల రూపాయలతో 54 గోకులాలను పూర్తి చేయడం జరిగిందన్నారు. పశు సంపదను రక్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ 90 శాతం సబ్సిడీని అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు సొమ్ము 1600 కోట్ల బకాయిని, కూటమి ప్రభుత్వం చెల్లించి రైతులకు అండగా నిలిచిందన్నారు. ప్రతి రైతుకు ఆర్థిక సహాయంగా కేంద్ర నుంచి రు. 10 వేలు, రాష్ట్రం నుంచి రు.10వేలు చొప్పున మొత్తం రు.20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని త్వరలో అందించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో రైతులకు ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన వెయ్యి రూపాయలతోరు. ప్రతినెల క్రమం తప్పకుండా రు.4వేల రూపాయలను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. దివ్యాంగులకురు. 3వేల నుంచి రు.15 వేల వరకు అందజేస్తున్నమన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.. గ్రామీణ రహదారులకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత్రిస్తూ జిల్లా వ్యాప్తంగా 134 కి.మీ. మేర 660 సిసి రోడ్లు నిర్మాణం పనులను రూ.65కోట్ల62లక్షల చేపట్టడం జరిగింద న్నారు. వాటిలో ఇప్పటి వరకు 75 కి.మీ. మేర 424 సిసి రోడ్లు నిర్మాణం పనులను రూ.43 కోట్ల 68 లక్షల వ్యయంతో పూర్తి చెయ్యడం జరిగిందని మంత్రి తెలిపారు. గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మన సంప్రదాయ పండుగలను భవిష్యత్తు తరాలకు అందించటానికి చొరవ చూపాలని, ఇటువంటి వేడుకల్ని నిర్వహించి నందుకు నిర్వాహకులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న, అభివృద్ధి సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో రు. రు.15.59 కోట్ల రూపాయలతో 680 గోకులాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. సంక్రాంతి వేళ పొలంలో వరి నాట్లు వేసి, మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు జిల్లా ప్రజలకి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలు మద్ధంశెట్టి వరలక్ష్మి, తిర్నాతి నాగమణి, దొడ్డిపట్ల భవాని, దేవరపల్లి హేమ సుందరికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, డ్వామా పిడి ఎ.నాగ మహేశ్వర రావు, గ్రామ సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మోడరన్ జూనియర్ కాలేజీలో ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

రామచంద్రపురం,మేజర్‌న్యూస్ : సంక్రాంతి పురస్కరించుకుని మోడరన్ జి.ఆర్.సి జూనియర్ కాలేజీ నందు శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి విశేషస్పందన లభించినట్లు విద్యాసంస్థల అధినేత లయన్ డాక్టర్ జి.వి.రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 72మంది ఈ పోటీలో పాల్గొన్నారని తెలిపారు. సంక్రాంతి శోభను, సంప్రదాయాల ను గుర్తుచేసేలా రంగవల్లులు తీర్చిదిద్దారని తెలిపారు. రంగవల్లిలు తీర్చిదిద్దడం అనేది గొప్ప కళ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు జి.వి.రావు బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతిఒక్కరికి అభినందన పూర్వక బహుమతి ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్ మాట్లాడుతూ ముచ్చటైన రంగవల్లులతో సంక్రాంతి పండుగకు స్వాగతం పలకడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్. ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సి.హెచ్. శ్రీనివాస్, మోడరన్ జూనియర్ కాలేజీ స్టాఫ్ పాల్గొన్నారు.

బివీసి ఇంజనీరింగ్ కళాశాల ఓడలరేవులో ఘనంగా సంక్రాంతి సంబరాలు

అల్లవరం, మేజర్‌న్యూస్ : తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని ఓడలరేవు బీబీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. తెలుగు వారి సంప్రదాయాలు ప్రతిబింబించేలా అచ్చతెలుగు వస్త్రధారణలో విద్యార్థినీ విద్యార్థులు సందడి చేసారు. ప్రభలు, రంగవల్లులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువులు, భోగి మంటలతో పాటు అరిసెలు, చక్కెరపొంగలి, గారెలువంటివంటకాలు కళాశాలలో వండి వడ్డించారు. విద్యార్థులు అందరూకోలాటం, సాంప్రదాయ నృత్యాలతో చూపరులను ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో బీవీసీ అధినేత బోనం కనకయ్య, ఛైర్మన్ బోనం కృష్ణ సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ డా. డి.మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డా. ఏ.ప్రవీణ్, డా. ఆలపాటి రామకృష్ణ, ప్రొ. బి.శ్రీనివాస్, డా. ఎన్.శివకుమార్, డా. సంబాన శ్రీకాంత్, ప్రొ. వై.వీ.రమణమూర్తి, డా. తోరం శరణ్ కుమార్, డా.బియస్సెన్‌మూర్తి, డా.మీరాషరీఫ్, ప్రొఫెసర్ ఎ.దుర్గామాధురి, కార్యనిర్వహణాధికారి ఆకుల వైఆర్వీ ప్రసాద్, సాంస్కృతిక కమిటీ ఇన్‌ఛార్జ్ జె.ఆంజనేయులు,డా.శ్రీపాద రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో ధూమపానం నిషేదించాలి–డా.అడ్డాల

కాకినాడ, మేజర్‌న్యూస్ : స్థానిక రమణయ్యపేటలో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన ప్రపంచ ధూమపాన ప్రభావిత దినోత్సవం సందర్భంగా పొగాకు ఉత్పత్తుల వినియోగం వలనకలిగే దుష్ప్రభవాలపైన అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా.అడ్డాల సత్య నారాయణ మాట్లాడుతూ క్యాన్సర్, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సివోపిడి), గుండె జబ్బులు, పుట్టుకతో వచ్చే లోపాలు మరియు శరీరంలోని దాదాపు ప్రతి అవయవానికి సంబంధించిన ఇతర ఆరోగ్య సమస్యలు సిగరెట్లను తాగడం వల్ల గణనీయమైన ప్రతికూల ఆరోగ్య ప్రభావాలు చూపుతాయని అన్నారు. సిగరెట్‌లు నుండి పీల్చే పొగలో క్యాన్సర్‌కారకాలు మరియు హానికరమైన రసాయనాలు ఉంటాయని, పొగాకులోని సైకోయాక్టివ్ డ్రగ్ అయిన నికోటిన్, సిగరెట్లకు బాగా వ్యసనపరుస్తుంది. సిగరెట్ తాగేవారిలో దాదాపు సగం మంది పొగాకు సంబంధిత వ్యాధితో మరణిస్తారు మరియు సగటున 14 సంవత్సరాల జీవితాన్ని కోల్పోతారు. ప్రతి సంవత్సరం, సిగరెట్ తాగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా 8 మిలియన్లకు పైగా మరణాలు సంభవిస్తున్నాయని, వీరిలో 1.3 మిలియన్ల కంటే ఎక్కువ మంది ధూమపానం చేయనివారు పొగ త్రాగేవారు వదిలిన పొగ పీల్చడం వల్ల మరణిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ సభ్యులు డా. సువర్ణ, డా. సిరాజ్, అడబాల రత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

కాకినాడ, మేజర్‌న్యూస్ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. సంక్రాంతి తెలుగింటి సంబరమని ఈ సంబరాలలో పాల్గొన్న అధ్యాపకులకు, విద్యార్థులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు అధ్యాపకులకు విద్యార్థులకు రంగవల్లుల పోటీలు, బృందనాట్య, ఫాన్సీ డ్రెస్ పోటీలు, నిర్వహించారు.ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి డాక్టర్ నాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డి బ్యూలా, మహమ్మద్ షాహిద్దీన్, సి.సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, ఐ గౌరీ ప్రియ, అధ్యాపకులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఐడియల్ డిగ్రీ కళాశాలలో గేదెల రాజు చిత్ర యూనిట్ సందడి

కాకినాడ, మేజర్‌న్యూస్ : స్థానిక విద్యుత్ నగర్‌లోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో జరిగిన నేషనల్ యూత్ డే వేడుకల్లో గేదెల రాజు కాకినాడ తాలూకా చిత్ర సభ్యులు పాల్గొన్నారు. కాకినాడకి చెందిన చైతన్య మోటూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా, రవి ఆనంద్, చిన్నిబిల్లి మరియు రామచంద్రం పుణ్యమంతుల ప్రధాన పాత్రలో నటించారు. ప్రముఖ సింగర్ రఘు కుంచే సమర్పణలో వస్తున్న ఈ చిత్రంలో ఆయనే టైటిల్ పాత్రలో నటించి, సంగీత దర్శకత్వం వహించారు. దర్శక నిర్మాతలు మరియు నటులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దర్శకుడు చైతన్య మోటూరి మాట్లాడుతూ విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా కేరీర్ మలుచుకోవాలని, జీవితంలో స్థిరత్వం అవసరమని అన్నారు. ఐడియల్ కాలేజీలో కాలేజీ ఎపిసోడ్ చిత్రీకరణ జరిగింది అని తెలిపారు. కాలేజీ మేనేజింగ్ డైరెక్టర్ వాసు గారు మాట్లాడుతూ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నామని తెలిపారు. చిత్రంలోని రాజో గేదెల రాజా పాటకు విద్యార్థులు హుషారుగా డాన్స్ చేశారు. రామచంద్రమ్ పుణ్యమంతుల, టీనా శ్రావ్య, శ్రీదివ్య, వికాస్, మౌనిక, రవి ఆనంద్ చిన్నిబిల్లి, శ్రీకాంత్ అయ్యంగార్, మెహబూబ్ భాషా, కిట్టయ్య తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి సంగీతం–రఘుకుంచే, డిఓపి–సాయికుమార్ దారా, ఎడిటర్– సుధీర్ ఎడ్ల, కాస్ట్యూం డిజైనర్– సింధు దిలీషా, కోడైరెక్టర్–శేఖర్ కుంపట్ల, నిర్మాతలు–రవి ఆనంద్ చిన్నిబిల్లి, వాణి రవికుమార్ మోటూరి; కథ, కథనం, మాటలు, దర్శకత్వం–చైతన్య మోటూరి.

ఈ నెల 12న మెగా ముగ్గుల పోటీల్లో పాల్గొనండి

- విలువైన బహుమతులు గెలుచుకోండి
- 13,14 తేదీల్లో మల్టిపుల్ ఎంటర్‌టైన్‌మెంట్

రామచంద్రపురం మేజర్ న్యూస్ : జనవరి 12 న రామచంద్రపురం వి.ఎస్.ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవ 2K25 పేరుతో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొని విలువైన బహుమతులు గెలుచుకోవాలని మంత్రి సుభాష్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. సంక్రాంతి సంబరాలు మరింత ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు.జనవరి12ఉదయం9:30గంటలకు ప్రారంభ మయ్యే ఈ ముగ్గుల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా వాషింగ్ మిషన్, రెండో బహుమతిగా రిఫ్రిజిరేటర్ (ఫ్రిడ్జ్), మూడో బహుమతిగా ఫ్లాట్ ఎల్ఈడి కలర్ టీవీ అందిస్తున్నారు. ఉత్సాహవంతులైన మహిళలు ఈ పోటీల్లో పాల్గొని మూడు రోజుల పాటు జరిగే మల్టిపుల్ ఈవెంట్ల ను విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 80965 23666 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. అలాగే 13 న ఉదయం 7 గంటలకు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, కోలాటం, మధ్యాహ్నం 3 గంటలకు ఫ్లాష్ మాబ్, మ్యాజిక్ షో, సాయంత్రం 6:30 గంటలకు డాన్స్, పాటల పోటీలు, 14 న సాయంత్రం 6:30 గంటల నుంచి జబర్దస్త్ కామెడీ షో, ధీ టైటిల్ విన్నర్స్ జానుతో డాన్స్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేసి ఉన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలోని ప్రజలందరూ ఈ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొని సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో, ప్రజలతో మరింత ఉత్సాహంగా జరుపుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజలకు పిలుపునిచ్చారు.

నా విధులకు ఆటంకం కలిగించవద్దు

– నాపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను సహించేది లేదు

యు.కొత్తపల్లి, మేజర్‌న్యూస్ : తనపై కొందరు తప్పుడు ప్రచారం చేసి తాను నిర్వహిస్తున్న వివోఎ ఉద్యోగం లాక్కునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఉప్పాడ వివోఏ ఓసిపిల్లి కృప అన్నారు. ఈ సందర్భంగా ఆమె శనివారం ఆమె స్వగృహం వద్ద నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉప్పాడ గ్రామంలో గత పది సంవత్సరాల నుంచి వివోఎగా నేను విధులు నిర్వహిస్తున్నానని, గతంలో నా కుటుంబ సమస్యల వల్ల నన్ను ఉద్యోగం నుంచి కొన్ని రోజుల పక్కన పెట్టారని, ఆ సమయంలో వేరే ఆమెకు తాత్కాలికంగా ఉద్యోగం కల్పించారని, మా ఇంట్లో సమస్యలు కుదురుకున్నాక మరలా నా ఉద్యోగం నాకు ఇచ్చారని, ఈ సమయంలో నాపై తిరంశెట్టి చిన్ని తప్పుడు ఆరోపణ చేస్తూ నేను 27 లక్షల రూపాయలు దోచుకున్నానని ఆరోపించారని ఆమె అన్నారు. నాపై చేస్తున్న తప్పుడు ప్రచారంలో ఉన్న సొమ్మును ఎక్కడ జరిగిందో నిరూపించాలంటూ ఓసిపిల్లి కృప అన్నారు.

నిరూపించకపోతే కేసు పెట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపారు. 36 గ్రూపులో నాకు 35 గ్రూపులు సపోర్ట్ ఉందని, ప్రతి ఒక్కరూ నన్ను ఉండాలని కోరుకునే వాళ్లే కానీ వద్దనే వాళ్ళు లేరంటూ ఆమె అన్నారు. ఆమెకు సపోర్టుగా కొన్ని గ్రూపుల సభ్యులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నలోని అసమాన పోరాట పటిమ, ధైర్య సాహసాలు నేటి తరానికి ఆదర్శం

– జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి

కాకినాడ, మేజర్ న్యూస్ : బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో వడ్డె ఓబన్న కీలకపాత్ర పోషించారని, పేద రైతులు, గ్రామస్తులు హక్కులను కాపాడటంలో ఓబన్న అసమానమైన పోరాటం చేశారని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కాకినాడ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. బిసి సంక్షేమ శాఖ అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమానులు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్షణ్మోహన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటం ప్రారంభానికి ముందు 1857లో భారతదేశంలోని బ్రిటిష్ పాలన వ్యతిరేకంగా జరిగిన ప్రతి ఘటనలో వడ్డే ఓబన్న ముఖ్యపాత్ర పోషించారన్నారు. స్వతంత్ర సంగ్రామంలో ఒక అధ్యాయంగా నిలిచి, వడ్డే ఓబన్నలోని ప్రజాస్వామ్య విలువలు, ధైర్య సాహసలను ప్రజలకు తెలియచేయాలనే లక్ష్యంతో ఆయన జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారకంగా నిర్వహిచాలని నిర్ణయించడం శుభ పరిణామం అని జిల్లా కలెక్టర్ తెలిపారు. 1807 సంవత్సరం, జనవరి 11న నంద్యాల జిల్లా, సంజమల మండలంలో నొస్సం గ్రామంలో జన్మించిన వడ్డే ఓబన్న బ్రిటిష్ పాలకుల నుంచి పేద రైతులు, గ్రామస్తులు హక్కులను కాపాడటంలో అసమానమైన పోరాటం చేశారన్నారు. బ్రిటీష్‌వారిపై వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటంలో వడ్డే, బోయ, యానాది, చెంచు వంటి ఇతర సామాజికవర్గాలకు చెందిన వ్యక్తులను భాగస్వామ్యం చేసుకుని ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా వడ్డెర సంఘంలో ఆయనకున్న గౌరవం మరింత పెరిగి, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడిగా, సామాన్యుల హక్కులు కోసం చేసిన పోరాటంలో గొప్ప నాయకుడిగా గుర్తింపు పొందారని జిల్లా కలెక్టర్ కొనియాడారు. ఓబన్న పుట్టినరోజును కేవలం ఒక జయంతి కార్యక్రమంగా జరుపుకోకుండా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా చేసిన స్వాతంత్ర పోరాటంలో ధైర్య సహసాలు, ప్రజా ప్రయోజనం కోసం చేసిన కృషి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.
కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎం.లల్లి, కాకినాడ డివిజన్ సహాయ బీసీ సంక్షేమ అధికారి తేజోమూర్తుల వీరభద్ర ప్రసాద్, కార్యాలయ పర్యవేక్షకులు గోవాల సతీష్ కుమార్, సిబ్బంది కారపు సూర్య శివ ప్రసాద్, ఈశ్వరి, మధు, యేసురత్నం, హెచ్డబ్లూఓలు బహుదూర్, వై.కల్పన, పి.జయసుందరి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 13 తేదీ సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) వేదిక కార్యక్రమం రద్దు

– జిల్లా కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ, మేజర్‌న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం ఈ నెల13 వ తేదీన సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా రద్దు చేసినట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

దేవస్థాన హై స్కూల్ మరియు కాలేజ్ స్టూడెంట్స్‌తో ముగ్గులు పోటీ

అన్నవరం,మేజర్‌న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో సంక్రాంతి సంబరాలు మహోత్సవంలో భాగంగా శనివారం శ్రీస్వామివారి దేవస్థానం కొండపైన,సర్కులర్ మండపం వద్ద అన్నవరం గ్రామస్తులు మరియు జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ,హైస్కూల్ విద్యార్థులచే ముగ్గులు పోటీ నిర్వహిం చారు. కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు సమక్షంలో మొదటి, రెండవ మరియు మూడవ బహుమతులు నిర్ణయించడం జరిగినది.

శనివారం ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ

అన్నవరం,మేజర్‌న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామివారి సన్నిధానంలో శనివారం కావడంతో ఘనంగా ప్రాకార సేవ నిర్వహించారు. ముందుగా అర్చకులు సత్యదేవుడు అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి వేద పండితుల మంత్రోచ్ఛరణ, భక్తుల నామస్మరణతో మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణ గావించారు. ఈప్రాకార సేవా కార్యక్రమంలో దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, ఏఈఓ దామోర్ల కృష్ణారావు, కొండలరావు, గణపతి, ఆలయ అర్చకులు,ఆలయ సూపర్డెంట్ మరియుదేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పందెంకోడి ముందే కూసింది

- జోరుగా పందెం రాయుళ్లకు ఆహ్వానం
- బరులు ఏర్పాటు చేసిన నిర్వాహకులు
- లక్షల్లో పందాలకు సిద్ధం
- ప్రేక్షకపాత్రలో రక్షక భటులు

ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : గ్రామాల్లో కోడిపందాలు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అధికారులు చూచాయగా అనుమతులు ఇవ్వడంతో పందెం రాయుళ్లకు ఆహ్వానాలు పంపుతున్నారు. మీకేం పరవాలేదు అంటూ నిర్వాహకులు పందెం రాయుళ్లకు భరోసా ఇస్తున్నారు. ముఖ్యంగాజిల్లాలోని మండలంలోని ఆత్రేయపురం బొబ్బర్లంక, తాడిపూడి, లొల్ల వద్దిపర్రు పేరవరం ర్యాలీ గ్రామాల్లో పందాలు నిర్వహించేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అధికారులను కలుసుకుని అనుమతులు పొందినట్లు సమాచారం. బరుల వద్దపందెం కోళ్ళు సరఫరా చేసేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆయా బరుల సమీపంలో వందల సంఖ్యలో పందెం పుంజులను మేపుతున్నారు. వాటికి పిస్తా బాదం వంటి డ్రై ఫ్రూట్స్‌తోపాటు బీకాంప్లెక్స్ వంటి మందులు కూడా వేసి బలంగా తయారు అయ్యేటట్లు చూస్తున్నారు. ఇవన్నీ అధికారుల కనుసన్నల్లోనే జరగడం శోచనీయం. అడపదడప మొక్కుబడిగా దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. గత సంవత్సరం కోడి పందాలు ఆడి ఆర్థికంగా దెబ్బతిన్న వాళ్ళు ఉన్నారు. మండల కేంద్రం ఆత్రేయపురం శివారు లొల్ల రోడ్‌లో భారీ పందాలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పార్కింగ్‌తోపాటు గుండాట, పేకాట, మద్యం అమ్మకాలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే బొబ్బర్లంక అడ్డ గట్టు వద్ద ట్రైల్ రన్ కూడా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం కొంతకాలంగా జరుగుతుంది. నాటు కోళ్ల పెంపకం వద్ద పందాలకు శ్రీకారం చుట్టారు. అక్కడే పెద్దఎత్తున జూద ప్రక్రియ, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. భీమవరం నరసాపురం తణుకు, రాజమహేంద్రవరం, హైదరాబాద్ తదితర నగరాలకు ఆహ్వానాలు వెళ్లాయి. గతంలో మండలంలో 3 కోట్ల దాకా పందాలు జరిగాయి. గత సంవత్సరం రూ.30 లక్షలు వరకు పలువురు అధికారులకు ముడుపులు అప్పజెప్పిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికే నియోజకవర్గ స్థాయి అధికారులకు కోసలు నల్ల పెట్టలు పంపడం విశేషం. ఎప్పటికైనా ఉన్నతాధికారులు కళ్ళు తెరిచి జూదాలను అరికట్టకపోతే పేదలు ఆర్థికంగా చితికిపోయే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.

కోడిపందాల బరులు ధ్వంసం

- కోడిపందాల బరుల నేరస్తులపై బైండోవర్ కేసులు
- హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తున్న అధికారులు

కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో కోడి పందాలకు సిద్ధం చేస్తున్న బరులను కాకినాడ పోలీసులు ధ్వంసం చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వులను అధికారులు అమలు చేస్తున్నారు.సోమవారం నుండి ప్రారంభం కానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జరిగే కోడిపందాలకు ఏర్పాటు చేయుచున్న కోడి పందాల బరులను ధ్వంసం చేసి, బరులు వేసేవారిని, పాత నేరస్తులను కాకినాడ జిల్లా పోలీసులు బైండోవర్ చేస్తున్నారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవ ఉత్తర్వులతో తుని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సైకృష్ణమాచారి కోడిపందాల బరులను ధ్వంసం చేయించారు. గతంలో కోడి పందాలు నిర్వహించినవారికి పోలీస్, రెవిన్యూ అధికారులు నోటీసులు అందచేస్తున్నారు. కోడి కత్తుల తయారీ, విక్రేతలను, కోడి కత్తులు కట్టే వారిని బైండోవర్ చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తున్న అధికారులు. అనుమానిత ప్రదేశాలలో, అవసరమైన చోట పోలీసులు డ్రోనులు సిద్ధం చేసుకున్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- కాకినాడ రూరల్ సిఐ చైతన్యకృష్ణ
- జిల్లా ఎస్పీ ఆదేశాలతో బరులు ధ్వంసం

కాకినాడ, మేజర్‌న్యూస్ : సోమవారం నుండి ప్రారంభం కానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జరిగే కోడిపందాలకు ఏర్పాటు చేయుచున్న కోడి పందాల బరులను ధ్వంసం చేసి, బరులు వేసేవారిని, పాత నేరస్తులను కాకినాడ జిల్లా పోలీసులు బైండోవర్ చేస్తున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో కోడి పందాలకు సిద్ధం చేస్తున్న బరులను ధ్వంసం చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వులను అధికారులు అమలు చేస్తున్నారు. కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ తిమ్మాపురం, కరప,పెదపూడి, గొల్లపాలెం, కోరింగ, ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో కోడిపందాల బరులను ధ్వంసం చేయించారు. గతంలో కోడి పందాలు నిర్వహించినవారికి పోలీస్, రెవిన్యూ అధికారులు నోటీసులు అందచేస్తున్నారు. కోడి కత్తుల తయారీ, విక్రేతలను, కోడి కత్తులు కట్టే వారిని బైండోవర్ చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తున్న అధికారులు. అనుమానిత ప్రదేశాలలో, అవసరమైన చోట పోలీసులు డ్రోనులు సిద్ధం చేసుకున్నారు.

ప్రహసనంగా పడవల పోటీలు

- పోటీలు తిలకించిన మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ హరీష్ మాధుర్, కలెక్టర్ మహేష్ కుమార్
- జ్యోతి ప్రజ్వలన, పూజ కార్యక్రమలు చేసిన ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ : సంక్రాంతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సంక్రాంతి పోటీలు ఆత్రేయపురం మండలంలో ప్రహసనంగా సాగాయి.లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సర్దార్ కాటన్ గోదావరి డ్రాగన్ బోటింగ్ రంగవల్లి స్విమ్మింగ్ కైట్ పోటీలను ఆత్రేయపురం మండలంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

అయితే అందుకు అనుగుణంగా పోటీల్లో పాల్గొనేందుకు పరిసర ప్రాంతాల ప్రజల నుంచి ఆదరణ కరువవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పడవల పోటీలు, ఈతల పోటీలు నిర్వహించి అధికారులు మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తు న్నాయి. పోటీలు తిలకించేందుకు స్థానికులు కూడా అంతగా ఆసక్తి చూపలేదని పలువురు పెదవి విరుస్తున్నారు. సంక్రాంతి సంబరాలు పోటీలను పర్యటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తిలకించారు. ముందుగా సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని పూజా కార్యక్రమలు నిర్వహించి పోటీలను ప్రారంభించగా, అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మధూర్ జెండా ఊపి స్మిమ్మింగ్ పోటీలను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎమ్మెల్యే సత్యానందరావు, ఆర్డీఓ శ్రీకర్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ లు శాంతికపోతాలను గాలిలోకి విడుదల చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన కూటమి నాయకులు, స్థానికులు ముఖం చాటేయడంతో వీక్షించేవారు లేక పోటీలు ప్రహసనంగా సాగాయి అని పలువురు చర్చించుకున్నారు.

అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- యు.కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్

యు.కొత్తపల్లి,మేజర్‌న్యూస్ : సంక్రాంతి సంబరాలను ప్రజలందరూ తమ కుటుంబసభ్యులతో కలిసి సాంప్రదాయబద్ధంగా ఆనందంగా జరుపుకోవాలని, అసాంఘిక కార్యక్రమాలైన కోడిపందాలు, జూదము, గుండాట తదితర వాటికి దూరంగా ఉండాలని యు.కొత్తపల్లి ఎస్సై వెంకటేష్‌ప్రజలకు తెలియజేశారు. సాంప్రదాయ క్రీడలు ముద్దు-కోడి పందెములు మరియు జూదములు వద్దు అని పిలుపునిచ్చారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలైన కోడిపందాలు, పేకాట, గుండాట తదితర కార్యక్రమాలు నిర్వహించినా, పాల్గొన్నా, వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ అన్నారు. ఎవరు కూడా కోడిపందాలు, జూదములు జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో సాంప్రదాయక్రీడలతో ఆహ్లాదకరంగా పండుగను నిర్వహించు కోవాలని ఎస్సై వెంకటేష్ అన్నారు.

క్రికెట్ కప్‌ను సొంతం చేసుకున్న కుమ్మూరు జంపు లెవెన్

- రన్నర్ బ్లూ స్టార్ చింతూరు

చింతూరు,మేజర్‌న్యూస్ : అల్లూరి జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలో జెకేసిటి ఆధ్వర్యంలో సీజన్ 1 కప్ నిర్వహించారు. ఈ టోర్నీలో సుమారు 72జట్లు పాల్గొనగా తుది సమరానికి బ్లూ స్టార్ చింతూరు - కుమ్మూరు జంపు లెవెన్ జట్లు చేరుకున్నాయి. టాస్ గెలిచి కుమ్మూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదటి బ్యాటింగ్ చేసిన చింతూరు బ్లూ స్టార్ జట్టు నిర్ణిత 15ఓవర్ల మ్యాచ్‌లో పది వికెట్లు కోల్పోయి 57 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో కరీం 16, నాగు 12 పరుగులు చేయగా కుమ్మూరు జంపు లెవెన్ బౌలర్ వెంకీ, అశోక్ చెరో మూడు వికెట్లు తీసుకోగా కన్నారావు రెండు వికెట్లుతో రాణించారు. అనంతరం లక్ష్యచేదనకు దిగిన కుమ్మూరు జంపు లెవన్ జట్టు 10ఓవర్లకు నాలుగు వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసి విజయం సాధించింది. బ్యాటింగ్‌లో నవీన్ 31 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. విన్నర్, రన్నర్ జట్లకు ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన యువకుడికి అభినందన

ఆలమూరు, మేజర్‌న్యూస్ : జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన యువకుడు పెద్దింటి నరసింహ కాశ్యప్ ను గ్రామస్తులు అభినందించారు.ఇటీవల మంగళగిరిలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 17 పోటీల్లో జట్టు కెప్టెన్ గా కాశ్యప్ పాల్గొన్నారు. అక్కడ జరిగిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరచడంతో అతనిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.ఈ మేరకు శనివారం గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఇటువంటి మరెన్నో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించి ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాంద్ర నాగ మోహన్ రెడ్డి, తాడి మెహర్ ఆదిత్య రెడ్డి, జ్యోతి రెడ్డి,శ్యామ్ సుందర్ రెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు

- ఘనంగా ప్రారంభమైన సర్ ఆర్థర్ కాటన్ టోపీ పోటీలు
- కార్యక్రమాలనుతిలకించిన మంత్రి కందుల దుర్గేష్ ఎంపీ హరీష్ మాధుర్ కలెక్టర్ మహేష్ కుమార్
- కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:క్రీడలతో ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ హరీష్ మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కలెక్టర్ మహేష్ కుమార్ లు అన్నారు. శనివారం ఆత్రేయపురంలో ట్రోఫీ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈసందర్భంగా జరిగిన సభలో మాట్లాడారు. పాశ్చాత్య సంస్కృతిని విడనాడి మన దేశ సంస్కృతిని కాపాడుకోవాలని అన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు, నేటి యువత చదువుతోపాటు క్రీడల్లో పట్ల దృష్టి సారిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు అన్నారు. తొలుతగా శాంతికపోతాలను ఎగురవేశారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. తొలి రోజు ఈత, పతంగులు, రంగవల్లి పోటీలు ముగ్గుల పోటీలు కోలాహలంగా జరిగాయి. ఈ పోటీల్లో 450 మంది పాల్గొని తమ ప్రతిభను సాటుకున్నారు. సంక్రాంతి పండగ కంటే ముందుగా సంక్రాంతిని తలపించేలా కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురంలో ఏర్పాటు చేసిన సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూజాకార్యక్రమంలోపాల్గొనిపోటీలను ప్రారంభించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మధూర్ జెండా ఊపి స్మిమ్మింగ్ పోటీలను ప్రారంభించారు. అలాగే జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఎమ్మెల్యే సత్యానందరావు,ఆర్డీఓ శ్రీకర్, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరు వెంకటరాజు లు శాంతికపోతాలను గాలిలోకి విడుదల చేశారు. ఈ కార్య క్రమాలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆత్రేయపురం జనసంద్రంగా మారింది. ఆకట్టుకున్న రంగవల్లులు అంబరాన్ని అంటిన విధంగా సర్ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలు ప్రారంభమ య్యాయి. ఈతల పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈతల పోటీలలో విజేతలకు పర్యాటక, సీమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే సత్యానందరావు లు విజేతలకు బహుమతులు అందజేశారు. 70 పైబడిన సంవత్సరాల వయసు గల మహిళ కిలోమీటర్ ఈతల పోటీలలో పాగొనడం విశేషం, అంతేకాకుండా ప్రత్యేక ప్రతిభావంతులైన ఇద్దరు యువకులు కూడా ఈతల పోటీలలో పాల్గొనడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అలాగే వృత్తి రీత్యా అమెరికాలో ఉంటున్న మహిళా ఇటీవల తమరాష్ట్రానికి రావడంతో ఈపోటీల గురించి తెలుసు కోవడంతో ఈతల పోటీలో పాల్గొన్నారు. విజేతలు కిలోమీటర్ దూరం మహిళల ఈతల పోటీలలో మొదటి స్థానం శకుంతల దేవి (విజయవాడ), రెండవస్థానం కృష్ణ డింపుల్, మూడవ స్థానం సౌజన్య కైవసం చేసుకున్నారు. మరియు 55 సంవత్సరాల పైబడి మహిళలఈతల పోటీలలో మొదటి స్థానం వై.ఏసమ్మ, రెండవ స్థానం పి.లక్ష్మి,మూడవ స్థానం నాగమణి నిలిచారు. అలాగే కిలోమీటర్ 45 సంవత్సరాల పైబడి పురుషుల ఈతల పోటీలలో మొదటి స్థానం పి.శివ గణేష్ (సర్కిల్ ఇన్స్పెక్టర్), రెండవ స్థానం అప్పల నాయుడు, మూడవ స్థానం టి.పి.రావు నిలిచారు.అలాగే 45 సంవత్సరాల వయసు లోబడి పురుషుల ఈతల పోటీలలో మొదటి స్థానం సాయి నిహాన్, రెండవ స్థానం జగదీష్, మూడవ స్థానం బాల గంగాధర్ లు నిలిచారు. అలాగే 15 సంవత్సరాల వయసు లోబడి పిల్లల ఈతల పోటీలలో మొదటి స్థానం ఎండి సిద్ధ, రెండవ స్థానం ఎస్‌కె సాజామిన్, మూడవ స్థానం జి.యశస్విని నిలిచారు. రంగవల్లుల పోటీలలో జి.అమ్మాజీ (మొదటి స్థానం), కె.సృజన (రెండవ స్థానం), టి.ఆదిశ్రీ (మూడవ స్థానం) విజేతలుగా నిలిచారు. 100 మీటర్ల 30-45 సంవత్సరాల వయస్సు మహిళల ఈతల పోటీలలో మొదటి స్థానం సింపుల్ కృష్ణ, రెండవ స్థానం శకుంతల దేవి 100 మీటర్ 30-45 పురుషుల ఈతల పోటీలలో మొదటి స్థానం తులసి చైతన్య,రెండవ స్థానం కె.నాగ కృష్ణ, మూడవ స్థానం శివ గణేష్; 100 మీటర్ల 45 సంవత్సరాల పైబడి పురుషులు మొదటి స్థానం అప్పల నాయుడు, రెండవ స్థానం వి.శ్రీనివాసరాజు, మూడవ స్థానం ఎం.శ్రీనివాసరావ్; 100 మీటర్ల 45 సంవత్సరాల పైబడి మహిళల ఈతల పోటీలలో మొదటి స్థానం ఏసుమణి, రెండవ స్థానం సీతారామమ్మ, మూడవ స్థానం పి.లక్ష్మి నిలిచారు. అనంతరం ఆత్రేయపురం గోదావరి తీరంలో నిర్వహించిన పతంగుల పోటీలను తిలకించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్ తాసిల్దార్ టి.రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకట్ రామన్, నాయకులు కె.వి.సత్యనారాయణ రెడ్డి,కరటూరి నరసింహారావు,ముల్లపూడి భాస్కరరావు, పిఎస్‌రాజు, జల్లి కామేశ్వరరావు, జుజ్జవరపు శ్రీహరి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, వివిధశాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు - ఎస్ఐ శ్రీను నాయక్

అనపర్తి,మేజర్న్యూస్ : సంక్రాంతి సంబరాలను ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి సాంప్రదాయబద్ధంగా ఆనందంగా జరుపుకోవాలని, అసాంఘిక కార్యక్రమాలైనా కోడిపందాలు, జూదము, గుండాట తదితర వాటికి దూరంగా ఉండాలని అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ ప్రజలకు తెలియజేశారు. సాంప్రదాయ క్రీడలు ముద్దు –కోడి పందెములు మరియు జూదములు వద్దు అని పిలుపునిచ్చారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలైనా కోడిపందాలు, పేకాట, గుండాట తదితర కార్యక్రమాలు నిర్వహించిన, పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ అన్నారు. గతంలో కోడిపందాలు ఏర్పాటు చేసిన బరులను గుర్తించి ఆ ప్రాంతాన్ని ట్రాక్టర్ తో దున్నించారు. ఎవరు కూడా కోడిపందాలు, జూదములు జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో సాంప్రదాయ క్రీడలతో ఆహ్లాదకరంగా పండుగను నిర్వహించుకోవాలని శ్రీను నాయక్ అన్నారు.

శరవేగంగా నడుపల్లి వాటర్ ట్యాంకు నిర్మాణం

పెరవలి, మేజర్న్యూస్ : నడిపల్లి పంచాయతీ నందు జలజీవన్ మిషన్‌లో భాగంగా 65 లక్షల ఎస్టిమేట్ తో 40 వేల కిలో లీటర్లు కెపాసిటీ గల వాటర్ ట్యాంకు నిర్మాణము పనులు శరవేగంగా జరుగుచున్నవి. జనవరి 11వ తేదీ శనివారం అండర్ గ్రౌండ్ కాంక్రీట్ పనులను గ్రామ సర్పంచ్ బీర సత్యవేణి రాజు, ఉప సర్పంచ్ ఏ రవీంద్రనాథ్ చౌదరి, డిఏ మరియు ఏఈ,ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు పరిశీలించారు. అధికారుల పర్యవేక్షణలో రాష్ట్ర ప్రభుత్వము 50% కేంద్ర ప్రభుత్వము 50% నిధులతో ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణం జరుగుతున్నది.

హెచ్ఎంపివి గురించి ఆందోళన పడకండి, కానీ అప్రమత్తంగా ఉండండి

- హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపివి) ఒక శ్వాసకోశ వైరస్ - డాక్టర్ శ్రీ రాజేశ్వరి సలాది

పెరవలి,మేజర్న్యూస్ : హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపివి) ఒక శ్వాసకోశ వైరస్ అనిఇది ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, మరియు రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను కలిగిస్తుంది అని డాక్టర్ శ్రీ రాజేశ్వరి సలాది అన్నారు. జనవరి 11వ తేదీ శనివారం మేజర్న్యూస్‌తో మాట్లాడుతూ ఈ వైరస్ పారామిక్సో విరిడే కుటుంబానికిచెందినది అన్నారు. హెచ్ఎంపివి ఎక్కువగా చలికాలం (వింటర్) మరియు వసంత ఋతువులో కనిపిస్తుంది అన్నారు. హెచ్ఎంపివి ఒక ఆర్ఎన్ఏ వైరస్. ఇది దగ్గు, జలుబు, కలుషితమైన ఉపరితలాల స్పర్శ ద్వారాసులభంగా వ్యాపిస్తుంది అన్నారు.

రోగ నిర్మాణం : 1.హెచ్ఎంపివి నుదిటి గాలి మార్గాల్లో చేరి చీకటి ముడతలు (సిలియా) క్షీణింపచేస్తుంది. 2.ఇది శ్వాసకోశ కణజాలం (రెస్పిరేటరీ ఎపితీలియం) మీద దాడి చేస్తుంది. 3.వైరస్ వ్యాప్తితో శ్వాసకోశంలో సోకిన ప్రాంతాలు ఇన్ఫ్లమేషన్‌కుగురవుతాయి అన్నారు.

హెచ్ఎంపివి వ్యాప్తి ప్రధానంగా వ్యక్తి నుండి వ్యక్తికి చేరుతుంది:
1.దగ్గు లేదా తుమ్ము ద్వారా: వైరస్‌తో కూడిన బిందువులు గాలిలో వ్యాప్తి చెందుతాయి. 2.ప్రత్యక్ష సంబంధం ద్వారా: వైరస్ ఉన్న వ్యక్తి చేతులు పట్టడం, ముక్కు లేదా మొహం రాయడం ద్వారా. 3.వైరస్ కలిగిన ఉపరితలాల ద్వారా: కాలుష్యానికి గురైన వస్తువులను లేదా ఉపరితలాలను ముట్టుకోవడం ద్వారా.

క్లినికల్ లక్షణాలు : 1.దగ్గు 2.జలుబు 3.ముక్కు దిబ్బరం 4.జ్వరం 5.శ్వాస తీసుకోవడం కష్టం (డీస్పీనియా) 6.చిన్నపిల్లలలో విపరీతమైన ఊపిరి ఆడటం (వీజింగ్)

ప్రమాదకారణాలు : 1.చిన్న పిల్లలు (5 సంవత్సరాల లోపు) 2.వృద్ధులు (65 సంవత్సరాల పైబడినవారు) 3.రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు 4.క్రోనిక్ శ్వాసకోశ వ్యాధులు (ఆస్తమా, సిఓపిడి) ఉన్నవారు

వయస్సు గుంపులు ప్రభావితమయ్యే వారు
1.చిన్న పిల్లలు 2.వృద్ధులు 3.ప్రీమ్యాచ్యూర్ బేబీలు

ముందు జాగ్రత్తలు
1.దగ్గు లేదా జలుబు ఉన్న వ్యక్తులతో భౌతిక దూరం పాటించాలి. 2.చేతులు తరచుగా సబ్బుతో కడగాలి. 3.శుభ్రంగా ఉండే ఆహారం మరియు నీరు తీసుకోవాలి. 4.మాస్క్ ధరించాలి.

హెచ్ఎంపివి నివారణ కోసం చేయవలసినవి
1.చేతులు తరచుగా కడగాలి: సబ్బు లేదా ఆల్కహాల్ బేస్డ్ హ్యాండ్ శానిటైజర్ వాడాలి. 2.మాస్క్ ధారణ: బయటకు వెళ్లినప్పుడు లేదా దగ్గు/జలుబు ఉన్నవారితో ఉన్నప్పుడు మాస్క్ ధరించాలి. 3.శుభ్రత పాటించాలి: ఇంటి పరిసరాలు, ఆట వస్తువులు, మరియు ఉమ్మడి ఉపరితలాలను శుభ్రంగా ఉంచాలి. 4.తరచుగా గాలి మార్పు: గదుల్లో గాలి సరిగా ప్రవహించేలా చూసుకోవాలి. 5.జలుబు లేదా దగ్గు ఉన్నవారు భౌతిక దూరం పాటించాలి. 6.జలుబు వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవాలి మరియు మందులను సరిగా వాడాలి.

చేయకూడని పనులు : 1.అనవసరంగా మొహాన్ని ముట్టుకోవద్దు: ముఖ్యంగా చేతులు శుభ్రం చేయకముందు. 2.దగ్గు లేదా తుమ్ము చేయకుండా తడి మూత్రాలు పంచుకోవద్దు. 3.బహిరంగ ప్రదేశాల్లో దగ్గడం లేదా తుమ్మడం. 4.వైరస్ కలిగిన వ్యక్తుల ఆహారాన్ని లేదా పానీయాలను పంచుకోవద్దు. 5.గందరగోళం కలిగించే పర్యావరణంలో ఎక్కువసేపు ఉండవద్దు. జాగ్రత్తలు పాటించడం ద్వారా హెచ్ఎంపివి వ్యాప్తిని నివారించవచ్చు. హెచ్ఎంపివి ఒక అంటువ్యాధి. ఇది వ్యక్తి నుంచి వ్యక్తికి దగ్గు, తుమ్ము లేదా వైరస్ కలిగిన ఉపరితలాలను ముట్టుకోవడం ద్వారా సులభంగా వ్యాపిస్తుంది. వైరస్ వ్యాప్తి ముఖ్యంగా చలికాలంలో ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా హెచ్ఎంపివి ప్రాణాంతకం కాదు. అయితే, ఈ వైరస్ కొందరికి తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు కలిగించవచ్చు:
1.చిన్నపిల్లలు 2.వృద్ధులు 3.రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు 4.దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు
తీవ్రమైన కేసుల్లో ప్రాణాపాయం కలిగే అవకాశముంది, ముఖ్యంగా వ్యాధి నశించకపోతే లేదా శ్వాస తీసుకోవడం కష్టమైతే.

ముఖ్యమైనది: 1.హెచ్ఎంపివి తగిన జాగ్రత్తలు తీసుకుంటే సాధారణంగా నియంత్రించవచ్చు 2.జాగ్రత్తలు మరియు చికిత్స: శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలి.
హెచ్ఎంపివి ఎక్కువగా ప్రాణాంతకంకాకపోయినప్పటికీ, అది అంటువ్యాధి అవడం వల్ల సముచిత జాగ్రత్తలు అవసరం అన్నారు. ప్రొఫైలాక్సిస్ ప్రత్యేకంగా హెచ్ఎంపివి నిరోధానికి ఏ ప్రత్యేక ఔషధం లేకపోయినప్పటికీ, వ్యాధి వ్యాప్తిని నివారించడానికి వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమే.

టీకాలు (వాక్సినేషన్): హెచ్ఎంపివికి ప్రత్యేక టీకా ఇంకా అభివృద్ధి దశలో ఉంది అన్నారు.

చికిత్స(ట్రీట్మెంట్): హెచ్ఎంపివికి నిర్దిష్ట యాంటీవైరల్ ట్రీట్మెంట్ లేదు. లక్షణాలతో సరిపోయే చికిత్స ఇవ్వబడుతుంది:
1)జ్వరం తగ్గించే మందులు (పారాసెటమాల్)2)దగ్గు మందులు 3)అవసరమైతే ఆక్సిజన్ థెరపీ ..

నిర్వహణ: 1.ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. 2.విశ్రాంతి తీసుకోవాలి. 3.శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
గమనిక: తీవ్రమైన సందర్భాల్లో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించాలి. హెచ్ఎంపివిలో .రిబావిరిన్ అనేది ఒక బ్రాడ్-స్పెక్ట్రమ్ యాంటీవైరల్ ఔషధం. ఇది కొన్ని వైరల్ ఇన్ఫెక్షన్ల చికిత్సలో ఉపయోగిస్తారు.

హెచ్ఎంపివిలో రిబావిరిన్ వినియోగం: 1) గురుత్వమైన కేసుల్లో:ముఖ్యంగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు తీవ్రమైనప్పుడు, లేదా రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో రిబావిరిన్ ఉపయోగించవచ్చు. ఇది వైరల్ పెరుగుదలను తగ్గించడంలో ఉపయోగకరంగా ఉంటుందని పరిశోధనల ద్వారా సూచించబడింది అన్నారు.
2)ప్రయోగాత్మక చికిత్స: హెచ్ఎంపివికి నిర్దిష్ట చికిత్స లేకపోవడంతో, రిబావిరిన్ ఒక ప్రత్యామ్నాయంగా అనేక సందర్భాల్లో ఉపయోగించవచ్చు.

ముఖ్యమైన విషయాలు: క్లినికల్ అధ్యయనాలు: రిబావిరిన్ యొక్క ప్రభావితత హెచ్ఎంపివి చికిత్సలో పూర్తిగా నిర్ధారించబడలేదు. సహజ నిషేధాలు: దీనిని ఉపయోగించే ముందు వైద్యుల సలహా అవసరం.

అవగాహన: 1.రిబావిరిన్ వినియోగం కేవలం తీవ్రమైన సందర్భాల్లోనే, అది కూడా వైద్యుల పర్యవేక్షణలో జరగాలి అంతేగాని సొంత ప్రయోగాలు చేయరాదు అన్నారు. 2. దీనికి సంబంధించిన దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) కూడా ఉండే అవకాశం ఉంది,అందుకే జాగ్రత్తగా ఉపయోగించాలి అన్నారు.

గమనిక: రిబావిరిన్ వినియోగం హెచ్ఎంపివి చికిత్సలో ఇంకా పూర్తిగా ప్రామాణిక పద్ధతిగా గుర్తించబడలేదు అన్నారు.. డోంట్ పానిక్ స్టే విజిలెంట్...అందరూ సంక్రాంతి పండుగను ఆనందకరంగా జరుపుకోవాలని డాక్టర్ శ్రీ రాజేశ్వరి సలాది కోరారు.

తల్లడిల్లుతున్న కుటుంబాన్ని... అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదుకోవాలి

కాకినాడ, మేజర్న్యూస్ : రెక్కాడితేనే డొక్కాడని కుటుంబంపై విధి మరోసారి విరుచు కుపడింది. పగడాలపేటకు చెందిన మల్లాడి రాజు బార్జిపై పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై పని కి వెళుతున్న రాజును ముందునుండి వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెద్దాడు. కుటుంబానికి ఆధారమైన మల్లాడి రాజు మరణించడంతో అ కుటుంబం ఇంటి పెద్దను కొల్పోయింది. ఇంటికి ఆధారమైన రాజు మరణించడంతో తల్లి, తండ్రి, చూపులేని సోదరుడు, భార్య, ఇద్దరు పిల్లల భవివిష్యత్ అంధకారంగా తయారైంది. కుటుంబ పోషణ చూసుకునే రాజు లేకపోవడంతో ఆ కుటుంబం తల్లిడిల్లిపోతుంది. ఈ సందర్భంగా రాజు సోదరి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం తన సోదరుడిని పోట్టన పెట్టుకుందని, అతనిపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల భవిష్యత్ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు.

శ్రీ సత్యదేవుని దర్శించుకున్న సుప్రీం,హైకోర్టు న్యాయమూర్తులు

అన్నవరం,మేజర్న్యూస్ : కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి వ్రతం దర్శనార్థం శనివారం ఉదయం సుప్రీం కోర్టు జస్టిస్ ప్రశాంత్‌నాథ్ కుమార్ మిశ్రా దంపతులు, హైకోర్టు జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు కుటుంబ సమేతంగా శ్రీ సత్యదేవుని సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు, అర్చకుడు ఇంద్రగంటి సుధీర్, దేవస్థానం ఈవో సుబ్బారావు, ఏఈఓ దామెర్ల వెంకటకృష్ణారావు, కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామివారి వ్రతం ఆచరించి, శ్రీ స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఈవో సుబ్బారావు శ్రీస్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

4వ తరగతి ఉద్యోగులకు ఏకరూప దుస్తుల పంపిణి

పెద్దాపురం రూరల్,మేజర్న్యూస్ : పెద్దాపురం డివిజన్ పరిధిలో గల ఫోర్త్ క్లాస్ ఉద్యోగులందరికి శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కె.శ్రీరమణి చేతుల మీదుగా ఏక రూప దుస్తులు (యూనిఫామ్) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, ఎపిఆర్ఎస్ఎ నాయకులు కుమార్, డిప్యూటి తహశీల్దార్ భానుకుమార్, సిసి రమేష్ కుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ

పెద్దాపురం,మేజర్న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించు కోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్యాణాధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.82,960/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.59,00,901/-లు, కేశఖండన ద్వారా రూ.2,320/-, తులాభారం ద్వారా రూ.400/- లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.15,975/- మొత్తం రూ.1,61,556/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. స్వామివారిని వేదపండితులు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు.

అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి గోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- గుండాట, కోడిపందాలకు ఎటువంటి అనుమతులు లేవు
- పిఠాపురం పట్టణ ఎస్సై వి.మణికుమార్

పిఠాపురం,మేజర్న్యూస్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని పిఠాపురం పట్టణ ఎస్సై వి. మణి కుమార్ అన్నారు. సూర్య పత్రిక ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ... సంక్రాంతి పండుగ పేరుతో... గుండాట, పేకాట, కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, జూదము వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినచర్యలుతీసుకుంటామన్నారు. కోడి పందాలు గుండాట, జూదం వంటి వాటికి ఎటువంటి అనుమతులు లేవన్నారు.
అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పాల్గొనడం కూడాచట్టరీత్యానేరమన్నారు. అసాంఘిక కార్యకలాపాల పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆటో ద్వారా మైక్ ప్రచారం కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. సంక్రాంతి సందర్భంగా ఇళ్లు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని, తద్వారా ఆయాప్రాంతాల్లోగస్తీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సాంప్రదాయ సంక్రాంతి పండుగను సాంప్రదాయ ఆట,పాటలతో సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్నానన్నారు.

శ్రీశ్రీనివాసా విద్యా సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

పెద్దాపురంరూరల్,మేజర్న్యూస్ : పెద్దాపురం పట్టణంలో శ్రీశ్రీనివాసా విద్యా సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ముగ్గుల పోటీలు, కబడ్డి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఎం.చక్రం, వి.యస్.చక్రవర్తిలు మాట్లాడుతూ విద్యార్థులకు మన సాంస్కృతి సంప్రదాయాలు తెలియపరచడం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కళాశాల ప్రాంగణం విద్యార్థులతో సందడిగా మారింది.

విద్యార్థులు వేసిన ముగ్గులు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు కుంచె చినబాబు, ఏసుబాబు, బాబూరావు, మధుసూదనరావులతో పాటు అధ్యాపకులు, సిబ్బంది రామకృష్ణ, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భోగి మంట అంటే పుల్లలు వేసి మంట పెట్టడమొక్కటేకాదు

- టి.ఎన్.యూ.ఎస్. రాష్ట్ర కార్యదర్శి జయరాజు

కడియం, మేజర్న్యూస్ : భోగి మంటల్లో మనకు పనికిరాని కలప పుల్లలు వేయడం అంటే మన పురోభి వృద్ధికి ఆటంకమయ్యే చెడు అలవాట్లను మంటపెట్టిజ్ఞానజ్యోతి వెలిగించడమని టి.ఎన్.యూ.ఎస్. రాష్ట్ర కార్యదర్శి జయరాజు అన్నారు. రెండవ శనివారం మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాల గదులు సెలవురోజు దులిపించి చెత్తను ఆవరణలోని భోగిమంటల్లో వేశారు. అలాగే మనలో ఉన్న చెడు భావాలను కూడా వదిలించుకోవాలన్నారు. అప్పుడే జీవితం ప్రకాశవంతమవుతుం దన్నారు. గాలిపటాలు ఎగురవేయడమంటే ఆకాశమే హద్దుగా అభివృద్ధి చెందాలనే ఆకాంక్షను ప్రేరేపించడమన్నారు. బొంగరాల పోటీ నిరంతరం శ్రమిస్తేనే లక్ష్యం సాధ్యమని గుర్తు చేస్తుందన్నారు. వరుసగా గురువారం నుండి మూడురోజులు భోగిమంటలు వేసి పాఠశాలలో సంక్రంతి సంబరాలు నిర్వహించారు. తొలుత మండల విద్యాధికారులు ఎం.మణికుమార, వై. నాగేశ్వరరావు లు హరిదాసు వేషధారికి బియ్యం వేసి ప్రారంభించగా శనివారం సర్వశిక్షా మండల ఇంజినీర్ కే.వీరభద్రరావు భోగి దండను వేసి అందరికి ఈ సంక్రంతి శుభాలు కలుగజేయాలని ఆకాంక్షించారు.

మయ సభ కాదు..కోడి కోడిపందాల బరి

- పిఠాపురంలో...ఆశ్చర్యపరిచే "వేదికపై కోడిపందాల బరి"
- స్టేజి బల్లలపై మయ సభను తలపించేలా నిర్మించిన బరి

పిఠాపురం, మేజర్ న్యూస్ : అలనాడు మహాభారతంలో మయుడు... ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు భ్రమింపజేసేలా మయ సభను నిర్మించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ నాటి నిర్మాణ శైలిని తలపించేలా... ఆ మయసభ మహాద్భుత ఘట్టం పిఠాపురం నాయకుల పుణ్యాన "కోడి పందాలు నిర్వహించే" బరి రూపంలో సాక్షాత్కారమయింది. ఆనాటి మయసభ నిర్మాణం మానవుని భ్రమింప చేసేలా నీటికి బదులుగా ఇంద్ర నీలమణులు, పద్మ రాగ మణులతో ఎర్రని పద్మాలు, రజతాలతో తెల్లటి తామరలు, రాజహంసలు, చక్కని చేపలు, ముత్యాలతో తెల్లటి నురగలు, మరకతమణులతో నీటిలోని నాచును రూపొందించి అవి నిజమని భ్రమింప చేసేలా నిర్మించాడు. ఆనాటి మయసభను తలపించే మాయాజాలం నేడు పిఠాపురంలో... నాయకుల పుణ్యాన సంక్రాంతికి నిర్వహించే కోడిపందాల బరి రూపంలో సాక్షాత్కారమై అందరినీ ఆశ్చర్య చకితులను చేస్తుంది. జూదం, గుండాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎటువంటి అనుమతులు లేవని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా... సంక్రాంతి పండుగ సందర్భంగా ఏదో ఒకచోట... గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించడం ప్రతి ఏటా జరుగుతుంది. కానీ... నాయకులు కాస్త రూటు మార్చి ఒక కొత్త సంప్రదాయానికి తెరతీస్తూ... సభలు, సమావేశాలు, ఫంక్షన్లు నిర్వహించే స్టేజీ బల్లలపై కోడిపందాల బరిని ఏర్పాటు చేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఫ్లడ్ లైట్ల వెలుతురులో మయసభను తలపించేలా ఏర్పాటుచేసిన "వేదికపై కోడిపందాలు బరి" ని చూడాలంటే... పిఠాపురం స్థానిక వైయస్సార్ గార్డెన్ కు రావాల్సిందే మరి.

పూర్వ విద్యార్థుల,బాల్యమిత్రుల అపూర్వ సమ్మేళనం

-కానూరు జెడ్పి స్కూల్ 80-81 నుండి84- 85 బ్యాచ్ ఆత్మీయ సమావేశం
-40 ఇయర్స్ స్నేహలత పేరుతో అలనాటి స్నేహితుల కలయిక

పెరవలి,మేజర్న్యూస్ : కానూరు గ్రామంలోని శ్రీ అక్కిన చంద్రయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 1980-81, నుండి 1984-85బ్యాచ్ పూర్వ విద్యార్థుల బాల్య మిత్రుల అపూర్వ సమ్మేళనం కార్యక్రమం జనవరి 11వ తేదీ శనివారం కానూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో ఘనంగా జరిగింది. నాలుగు దశాబ్దాలు తర్వాత కలుసుకున్న మిత్రులు పూర్వ విద్యార్థులు తమ తమ కుటుంబ సభ్యులతో ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ అప్పటి సంగతులను గుర్తుకు తెచ్చుకుంటూ ఒకరిని ఒకరు ఆటపట్టిస్తూ రోజంతా సరదాగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఈ సమావేశానికి పిలచి వారిని తమవారికి తమ కుటుంబసభ్యులకు పరిచయం చేసి తమ కుటుంబ సభ్యుల ఎదురుగా తమకు చదువులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అప్పటి గురువులు ఈడుపుగంటి సుబ్బారావు, బమిడిపాటి సుబ్బారావు, బి.కృష్ణమూర్తి, పెదపూడి నారాయణరావు తోపాటు ఇప్పటి కానూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చోడపనీడి రామాంజనేయులను ఘనంగాసత్కరించారు. ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన పూర్వ విద్యార్థులు ముల్లపూడి రాజేంద్రప్రసాద్,జేష్ట వెంకటేశ్వరరావు, వీరమల్ల శ్రీనివాస్,కరుటూరి రామమోహన్‌రావు, నిమ్మలశ్రీనివాస్,రామడుగుల సూర్యనారాయణ, భావన కృష్ణమూర్తి, సాదా మునీశ్వరరావు, దూడలసత్యనారాయణ, బొండాడ విశాలాక్షి, టీవీ జానకిరాణి, అనపర్తి సీతారత్నం, తదితరులను పూర్వ విద్యార్థులు అభినందించారు.

మరిడమ్మ దేవస్థానంలో బొమ్మల కొలువు

పెద్దాపురం మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శనివారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల సందర్భంగా బొమ్మల కొలువు, భోగి మంటలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆసాదులు, సిబ్బంది వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల సహాయార్థం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



ఎటపాక, మేజర్‌న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గోమ్ము కొత్తగూడెం గ్రామంలో ఉయిక రాంప్రసాద్. గంగారం గ్రామంలో మర్మం విజయ్ అనారోగ్య కారణాల మరణించారు. వారిది చాలా నిరుపేద కుటుంబమని ఈ విషయాన్ని తెలుసుకున్న జమాల్ ఖాన్, మరణించిన కుటుంబానికి తలా ఒక 3000 రూపాయలు చొప్పున మొత్తం 6000 వేల రూపాయలు మృతుని కుటుంబ సభ్యులకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుట్టి రమేష్ బాబు, కణితి మధు, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, ముత్తయ్య, గుత్తా వెంకన్న, పండ రమాదేవి, రాము ఉయిక, సున్నం శివాజీ, జెకె సిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతగా ముగిసిన ఆదిత్య కలర్స్ 2025 యువజనోత్సవాలు

"గోదావరి జిల్లాలు అంటే ఎంతో ఇష్టం"
మీరు గోల్ నిర్ణయించుకోండి దాని సాధించడం కోసం కష్టపడండి - కిరణ్ అబ్బవరం"

కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంఆదిత్యయూనివర్సిటీలో నిర్వహిస్తున్న యువ జనోత్సవాలు మూడవ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సాగిలి, జిల్లా ఎస్.పి.విక్రాంత్ పాటిల్, ఛాన్సలర్ డా.ఎన్. శేషారెడ్డి, విశిష్ట అతిథిగా సినీనటుడు కిరణ్ అబ్బవరం పాల్గొన్నారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి అందరూ క్షేమంగా ఇంటికి వెళ్లాలని కోరారు. సినీ నటుడు కిరణ్ అబ్బవరం సందడి చేశారు. ఆయన రాకతో విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. ఆయన రాకతో ఆదిత్య కలర్స్ కు మెరుపులు అద్దినట్లు మరింత కలర్ ఫుల్ గా కార్యక్రమం ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఆదిత్య క్యాంపస్‌కు రావడం తనకు ఎంతో ఇష్టం అని తన తొలిచిత్రం రాజావారు రాణిగారు షూటింగ్ ఇక్కడ చేయాలనుకున్నాము కానీ కుదరలేదు మిమ్మల్నందరినీ ఈ విధంగా కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది..అని కిరణ్ అబ్బవరం అన్నారు. డా.శేషారెడ్డి గారు ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన అసామాన్య విజేత గా నిలవడం మాములు విషయం కాదు. విధ్యార్థులంటే ఎంతోఇష్టం అని జీవితంలో మీరంతా హీరోలే అందుకు ముందు మిమ్మల్ని ఇష్టపడండి. మీ గోల్ నిర్ణయించుకోండి దాని కోసమే కష్ట పడండి. దానికోసమే ఆలోచించండి.. ఎవ్వరు ఏమన్నా పట్టించుకోకుండా మీ గోల్ రీచ్ అవ్వండి. నేను హీరో అవుతానంటే అందరూ నవ్వారు అదిపట్టించుకోకుండానా ప్రయత్నం చేసాను ఇప్పుడు హీరోగా మీముందు ఉన్నాను. పాజిటివ్ గా ఆలోచించండి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ గోదావరి జిల్లాలు అంటే ఎంతో ఇష్టం అని అన్నారు.ఆయన రాకతో మరింత జోష్ పెరిగింది..విద్యార్థినీ,విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.విద్యార్థులను ఉర్రూతలు ఊగించాయి. లేజర్ షో అద్భుతంగా సాగి ఎంతో ఆకట్టుకుంది..ఈ కలర్స్ యూత్ ఫెస్ట్ తో ఆదిత్య ప్రాంగణంలో సంక్రాంతి పండుగ ముందే వచ్చింది. మొత్తంగా కలర్స్ ఆద్యంతంఎంతోజోరుగా హుషారుగా విజయ వంతంగా ముగిసింది.ఈ సందర్భంగా ఆదిత్య ప్రో. ఛాన్సలర్ డా. ఎన్.సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈకార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన ప్రిన్సిపాల్స్‌కు డీన్‌లకు విభాగాధిపతులు ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బందికి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పోలీస్ సిబ్బందికి మీడియా ప్రతినిధులకు అందరికీ అభినందనలు కృతజ్ఞతలు తెలియజేసారు. చివరి రోజు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సాగిలి, జిల్లా ఎస్.పి.విక్రాంత్ పాటిల్, ఛాన్సలర్ డా.ఎన్.శేషారెడ్డి, శ్రీమతి లక్ష్మీరాజ్యం,ఎన్. శృతి రెడ్డి,డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి,వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి.శ్రీనివాస్ వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, డీన్స్ , విభాగాధిపతులు సిబ్బంది అధిక సంఖ్యలో సుమారు 50 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిపందాల బరులపై పోలీసులు దాడి

- పిఠాపురం మండలంలోని పలు గ్రామాల్లో బరులను ధ్వంసం చేసిన రూరల్ ఎస్సై ఎల్. గుణశేఖర్

పిఠాపురం,మేజర్‌న్యూస్ : సంక్రాంతి పండుగ సందర్భంగా... సాంప్రదాయ క్రీడలు ముద్దు - జూద క్రీడలు వద్దు అని పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్. గుణశేఖర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో... గతంలో కోడిపందాల నిర్వహించిన ప్రదేశాలను గుర్తించారు. కోడి పందాలు, గుండాటలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన టెంట్లు, శామియానాలు బరులను ఎస్సై గుణశేఖర్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ధ్వంసం చేశారు. సంక్రాంతి పండుగను సాంప్రదాయ పద్ధతుల్లో సాంప్రదాయ ఆటపాటలతో నిర్వహించుకోవాలని, ఎటువంటి అనుమతులు లేని జూదక్రీడలు, కోడిపందాలు, అశ్లీల నృత్యాలు వంటి వాటిని నిర్వహించరాదని, నిబంధనలను అతిక్రమించి నిర్వహిస్తే... నిర్వహించిన వారిపైన మరియు వాటిలో పాల్గొన్న వారి పైన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్ళువారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ల

మురికికూపంలో అన్న క్యాంటీన్

సామర్లకోట,మేజర్‌న్యూస్ : సామర్లకోట పట్టణంలో ఉన్న ఏకైక అన్న క్యాంటీన్ దుర్గంధం వెదజల్లడంతో ఇక్కడికి వచ్చే ప్రజలు,రోజూ వారి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన మున్సిపల్ అధికారులు అన్నా క్యాంటీన్ వద్ద మురికినీరు పోవడానికి సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయని కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్న క్యాంటీన్లకు 700 మంది వరకు టిఫిన్లు మరియు భోజనాలు చేయ డానికి వస్తున్నారు. అయితే అన్న క్యాంటీన్లో ఉన్న వ్యర్థ పదార్థాలు, మురుగునీరు పోవడానికి డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపైకి ప్రవేశిస్తుంది మరొకవైపు ఈ ప్రాంతంలో అన్న క్యాంటీన్ కి వెళ్లే ప్రజలకు దుర్గంధం మధ్య భోజనాలు చేసే పరిస్థితి ఏర్పడింది అన్న క్యాటరింగ్ క్యాంటీన్ లో ప్రతిరోజు సరఫరా చేసే అక్షయపాత్ర వారు నాణ్యతలేని భోజనం పెడుతున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి కూర విషయంలో నాణ్యత ఉండటం లేదని కూర లేక నీళ్ళ చార అని ఇక్కడ భోజనాలు చేస్తున్న ప్రజలు కార్మికులు ప్రశ్నిస్తున్నారు అధికారులు తక్షణ జోక్యం చేసుకుని అన్నా క్యాంటీన్ వద్ద మురికి నీరు పోవడానికి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అప్పటి వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని దీనిపై మున్సిపల్ కమిషనర్ వారు తగిన చర్యలు తీసుకోవాలని క్యాంటీన్ కి వచ్చే ప్రజలు కార్మికులు కోరుతున్నారు.

విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయల పట్ల అవగాహన పెంచుకోవాలి

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్న మాణిక్యం

చింతూరు, మేజర్‌న్యూస్ : చింతూరు మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను కళాశాలలో నిర్వహించడం వలన విద్యార్థులలో మన సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలగడంతోపాటు మన జీవితాల్లో పండగల ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో కుల, మత ప్రాంత బేధాలు లేకుండా ప్రతీ ఒక్కరు ఆనందోత్సాహలతో మూడురోజులు జరుపుకొనే పండగ సంక్రాంతి అన్నారు. సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని అభిలాషించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రంగవళ్ళులు, మేహింది, కేశాలంకరణ, సాంప్రదాయ వస్త్ర ధారణ, ఖో-ఖో, కబడ్డీ, మ్యూజికల్ చైర్ వంటి పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. అధ్యాపకులు విద్యార్థులు కలిసి కళాశాలలో బోగిమంటలు వేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్, జి.వెంకటరావు,ఆర్సిహెచ్ నాగేశ్వరరావు,జి.హారతి, డాక్టర్ వై.పద్మ, కె.శకుంతల,యస్.అప్పనమ్మ, కె.శైలజ, యన్.రమేష్, జి.సాయికుమార్, బి.శ్రీనివాసరావు, మూర్తి,సంగం నాయుడు,సినయ్య ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో అసంపూర్తిగా రహదారుల నిర్మాణం

- గతుకుల రోడ్లపై అవస్థలు పడుతున్న ప్రజలు

రంపచోడవరం,మేజర్‌న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో నిర్మాణం చేపట్టి సకాలంలో పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక రహదారులు నిర్మాణం చేపట్టి అర్ధాంతరంగా పనులు మధ్యలో నిలిపి వేయడంతో గతుకుల రోడ్లపై దుమ్ము లేచి ప్రయాణికులు, వాహనాల సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో రంపచోడవరం నుండి రంప గ్రామం వరకు కూటమి ప్రభుత్వం గుంతలు పూడ్చు పనిలో భాగంగా రహదారి పని మొదలుపెట్టింది. మెటల్ వేసి రోలింగ్ చేసి నెలరోజులు కావస్తున్నా పనులు పూర్తి చేయలేదు. ఈరహదారికి తారు వేయడం నిలిపివేశారు. నిధులు లేక ఆపుచేసారా, లేక సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు ఒప్పందం సరిలేక ఆపుచేసారో అర్థం కావడం లేదు. ఈ రహదారిపై తిరిగే వాహనాల వల్ల దుమ్ము ధూళి వల్ల ప్రయాణికులు, నడచి వెళ్ళేవారు, మోటారు వాహనాలపై వెళ్లేవారు అనారోగ్యం పాలవుతున్నారు. అలాగే పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రీడలు మానసిక వికాశానికి, శరీర దారుడ్యానికి దోహదపడతాయి

-యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలి
-పోలీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు,మేజర్‌న్యూస్ :క్రీడలు మానసిక వికాసానికి శారీరక దారుడ్యానికి ఎంతో దోహదపడతాయని, యువత క్రీడల పట్ల దృష్టిని సారించాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర హై స్కూల్ నందు నిడదవోలు సర్కిల్ పోలీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని యువత పెంపొందించుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని వాటిని సమానంగా స్వీకరించినప్పుడు భవిష్యత్తులో వారు అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకునే శక్తి సామర్థ్యాలు క్రీడా స్ఫూర్తితోనే పెరుగుతాయన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిడదవోలు నియోజకవర్గం లో పోలీస్ వారి ఆధ్వర్యంలో 14 బృందాలతో బ్యాడ్మింటన్ క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ క్రీడలైన వాలీబాల్, కబాడీ,బాల్ బ్యాడ్మింటన్ పై యువత ఆసక్తిని పెంచుకోవాలన్నారు. త్వరలో నిడదవోలు పట్టణంలో మినిస్టేడియం ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ మేరకు క్రీడామంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి వారితో సంప్రదించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక స్టేడియం ఉండాలన్న లక్ష్యంతో ముందుకెళుతుందని ఆ మేరకు క్రీడా పాలసీ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

క్రీడాకారులందరూ క్రీడల పట్ల తమ ప్రతిభ నైపుణ్యాలను ప్రదర్శించి విజయ లక్ష్యాన్ని చేరుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవి సుబ్బరాజు, సీఐ పివిజి తిలక్, ఎస్సై పి. శోభన్ కుమార్, పీడీలు బి ప్రదీప్, కే వి డి ఎం స్వామి, పి శ్రీనివాస్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కలక్టరేట్‌లో వడ్డే ఓబన్న జన్మదిన వేడుకలు

-డిఆర్వో టి సీతారామ మూర్తి

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్ లో అధికారికంగా వడ్డే ఓబన్న జన్మదిన వేడుకలను జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి టి సీతారామ మూర్తి తెలియ చేశారు. స్థానిక కలెక్టరేట్ లో శనివారం ఉదయం వడ్డే ఓబన్నా జన్మదిన వేడుకలకు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా డి ఆర్వో టి సీతారామ మూర్తి మాట్లాడుతూ, బ్రిటిష్ కాలంలో గ్రామీణుల శ్రమ, నిరంకుశ వైఖరీ, అధికంగా పన్నుల వసూళ్ల చెయ్యడం పై వారి పక్షాన నిలబడి ఎదురొడ్డి నిలిచిన సంచార జాతుల కుటుంబానికి చెందిన వ్యక్తీ వడ్డే ఓబన్నా అన్నారు. దేశ స్వాతంత్ర్య సమరం లో ఎందరో వారి ప్రాణాలను ఎదురొడ్డి నిలవడం జరిగిందని, చరిత్ర లో తెలియని ఎందరో ఉన్నారని , అటువంటి వ్యక్తుల్లోవడ్డే ఓబన్నా ఒకరన్నారు. సంచార జాతుల కుటుంబానికి చెందిన వడ్డే ఓబన్నా జయంతి అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ఈరోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వడ్డెర తొలి స్వతంత్ర సమరయోధుడు రేనాటి సౌర్యుడు బ్రిటిష్ వారి కదంబ ఆస్తాల నుంచి మన దేశ స్వతంత్ర ము కొరకు పోరాటం చేసిన యోధుడు అయినా వడ్డెర ఓబన్నగారి 217వ పుట్టినరోజును బిసి సంక్షేమ శాఖ ఆధ్వరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి బి శశాంక పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి బి. శశాంక, గిరిజన సంక్షేమ అధికారి కె ఎన్ జ్యోతి , ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా టిఎఆర్ స్కూల్లో స్పోర్ట్స్ ఫెస్ట్

-క్రీడల్లో విజేతలకు బహుమతులు.
-క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి
- కరస్పాండెంట్ టి.అప్పారెడ్డి

అనపర్తి, మేజర్‌న్యూస్ : గ్రామంలోని ప్రముఖ విద్యా సంస్థగా పేరుగాంచిన టిఎఆర్ స్కూల్లో శనివారం ఇంట్రమ్యూరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులతో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం స్కూల్లో నిర్వహించిన అనేక క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన సుమారు 900 మంది విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ అప్పారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ చిన్నతనం నుండి క్రీడలుపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల వల్ల అనేక లాభాలు ఉన్నాయని,క్రీడలవల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడతాయని అన్నారు. క్రీడల వల్ల చదువులో కూడా బాగా రాణిస్తారని అన్నారు. క్రీడలు శారీర దారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచుతాయని, క్రీడల్లో గెలుపు, ఓటమిలను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తితో నడుచుకోవాలని అన్నారు. విద్యార్థులందరూ సంస్కృతి సంప్రదాయాలను అలవర్చుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త సబ్బెళ్ళ అమ్మిరెడ్డి, డాక్టర్ కె శ్రీలక్ష్మి, టి రామకృష్ణారెడ్డి, క్రీడా అధ్యాపకులు టి వీర రాఘవరెడ్డి, జి. క్లర్క్ కౌర్, కె. వెంకటేశ్వరరావు, సీఐ సుమంత్, ఎస్ఐ శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న తహశీల్దార్ వెంకటలక్ష్మి

పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని శనివారం పెద్దాపురం సిహెచ్.వెంకటలక్ష్మీ శ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ పర్యవేక్షణ లో వేదపండితులు అమ్మవారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనాలు అందజేసి, అనంతరం ప్రసాదం అందజేశారు. ఈకార్యక్రమంలో వేదపండితులు, ఆసాదులు, సిబ్బంది వెంకటరమణ తదితరులు ఉన్నారు.

సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలకు వస్తున్న హైదరాబాద్ వాసులు

- కిక్కిరిసిన రహదారులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

రావులపాలెం, మేజర్‌న్యూస్ : సంక్రాంతికి సొంత ఊర్లకు వెళ్లే ప్రయాణికులతోచెన్నై-కలకత్తాజాతీయ రహదారి, విజయవాడ-రావులపాలెం ఎన్‌హెచ్16 రహదారి భారీగా రద్దీ పెరిగింది. దీంతో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించే గోపాలపురం సిద్ధాంతం బ్రిడ్జి నుండి రావులపాలెం జొన్నాడ బ్రిడ్జి వరకు వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఈతకోట టోల్ ప్లాజ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. నేడు, రేపు రద్దీ మరింత పెరుగుతుందనే అంచనాలు ఉన్నాయి. రద్దీ దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాలను పోలీసులు సూచిస్తున్నారు.

రామ మందిరంలో ప్రత్యేక పూజలు

అనపర్తి, మేజర్‌న్యూస్ : హైందవ సంఘాల పిలుపుమేరకు స్థానిక పాత ఊర్లోని సత్తిపోతా రెడ్డి శ్రీ తేతలి రామిరెడ్డి ఆధ్వర్యంలో కొలువు తీర్చిన రామాలయంలో శనివారం నాడు అయోధ్య బాల రాముని ప్రాణప్రతిష్ట మొదటి సంవత్సర వేడుకలు పురస్కరించుకుని నక్షత్రము తిధి ప్రకారము సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యావత్ హైందవ సంఘాలు ప్రతి ఊరు రామాలయాల్లో రామచంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించాలని సంకల్పించిన నేపథ్యంలో అనపర్తిలో కూడాఘనంగావేదాంతం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక పూజలు నామ పారాయణ నామ సంకీర్తనలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సతీష్ ఆలయ కమిటీ ప్రతినిధులు తేతలి వెంకటరెడ్డి చిర్ల వీర రాఘవరెడ్డి సత్తి పోతారెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదలు స్వీకరించారు.

గుండాట, కోడి పందాలకు ఎటువంటి అనుమతులు లేవు

- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
- పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్. గుణశేఖర్

పిఠాపురం,మేజర్‌న్యూస్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్ గుణశేఖర్ అన్నారు. పిఠాపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోడి పందాలు గుండాట నిర్వహించే ప్రాంతాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేశారు. సూర్య పత్రిక ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ... సంక్రాంతి పండుగ పేరుతో... గుండాట, పేకాట, కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, జూదము వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోడిపందాలు గుండాట, జూదం వంటి వాటికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పాల్గొనడం కూడా చట్టరీత్యా నేరమన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆటో ద్వారా మైక్ ప్రచారం కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. సంక్రాంతి సందర్భంగా ఇళ్లు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని, తద్వారా ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సాంప్రదాయ సంక్రాంతి పండుగను సాంప్రదాయ ఆట,పాటలతో సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్నానన్నారు.